క్లుప్తంగా

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలో బీవీఎస్ హాల్ ఎదురుగా టీవీ షోరూం వద్ద మంగళవారం సాయంత్రం 4 గంటలకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగేళ్లుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు రూరల్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హౌసింగ్ బోర్డులోని వెలుగు కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. ఎస్‌బీఐ కార్డులో రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.18,500లతో పాటు ఇన్‌సెంటీవ్స్ ఉంటాయని, ఇంటర్మీడియట్, ఆపైన చదువుకుని 22–35 ఏళ్ల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఏబీఎల్ డిక్షన్ ప్రొడక్షన్ ఆపరేటర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్ పాసై 18–32 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని వివరించారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



అందూరు రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అట్లూరు : మాజీ జడ్పీటీసీ సభ్యుడు అందూరు రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా సోమవారం పరామర్శించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలిసి ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా పరామర్శించడంతో పాటు ఆయన ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మేమున్నామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండామాధవరెడ్డి, పొన్నపలు బ్రహ్మానందరెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ సభ్యుడు గురివిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ



భోజనం వడ్డిస్తున్న సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రెడ్ల కల్యాణ మండపం, రెడ్ల సేవా సంఘం సభ్యులు, దివంగత కుమ్మర లక్ష్మయ్య, శేషమ్మల మనువరాలు దేప్తీదేవి జన్మదినం సందర్భంగా ఆమె తల్లిదండ్రులు హైమావతి, చంద్రమోహన్ సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, లింగారెడ్డి, శేఖర్, దేవానంద్ పాల్గొన్నారు.

సమస్యల సాధనకు కృషి చేస్తా



డి.చంద్రశేఖర్‌రావు

జమ్మలమడుగు రూరల్ : ప్రధానోపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖరరావు తెలిపారు. ఆదివారం డీసీఈబీ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలలో జమ్మలమడుగు మండల విద్యా శాఖాధికారి–2 చంద్రశేఖరరావు రెండవ సారి జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. జిల్లా అధ్యక్షుడుగా జి.వి. సుబ్బారెడ్డి, కోశాధికారిగా బి.శ్రీనివాస్‌రెడ్డి, జమ్మలమడుగు ఉపాధ్యక్షుడు వి. సూర్య నారాయణరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ జి.బాలయ్య, రాష్ట్ర కౌన్సిలరు ఎస్.లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులను ఎన్నుకోన్నారు.

గణితశాస్త్రంలో పీహెచ్‌డీ



మాధవి

కడప ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్. మాధవికి గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ అఫ్ ఎక్సమినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఆచార్య సునీత బాయ్ గారి మార్గదర్శకత్వంలో 'స్ట్రెస్ అండ్ మాథెమాటిక్స్ ఆంక్సిఏటీ ఆన్ ది అచివ్మెంట్ ఇన్ మాథెమాటిక్స్ అఫ్ సీనియర్ సెకండరీ స్టూడెంట్స్' అంశంపై మాధవి పరిశోధనా గ్రంథం సమర్పించారు. ఇందుకుగానూ ఎస్.మాధవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. ఎస్.మాధవికి డాక్టరేట్ రావడంపట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు మరియు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎకో గణేశా.. పర్యావరణ హితేశా



తుది మెరుగులు దిద్దుకుంటున్న గణనాథుడు



రామనామ గణపతి



520 టెంకాయలతో గణపతి విగ్రహం



కొండ, దేవాలయం సెట్టింగ్

- పీఓపీ లేకుండా విగ్రహాల తయారీ
- నీటిలో కరిగే పదార్థాల వినియోగం
- అందంగా రూపుదిద్దుకున్న గణపయ్యలు
- ఇతర రాష్ట్రాలకు సరఫరా



మూషిక వాహన గణపతి కోసం రూపొందించిన మూషికాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పంచ వ్యాప్తంగా హిందూ సమాజం విస్తృతంగా జరుపుకొనే ప్రసిద్ధ పండుగ వినాయక చవితి. ఈ పర్వదినం సదర్భంగా గణపతి విగ్రహాలను కొలువు దీర్చి 3, 5, 7, 9, 11 రోజుల పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే ఇటీవలి కాలంలో ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్(పీఓపీ)తో తయారు చేసే విగ్రహాలను ఉపయోగిస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి వినాయక విగ్రహాలు ఉపయోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు ఈ దిశగా ప్రజలను చైతన్య పరుస్తున్నారు. పట్టణానికి చెందిన రహీమ్ అనే కళాకారుడు పట్టాభిరామ మండి మర్చంట్స్ సమీపంలో పేపర్ పేస్టు, బంక, వెదురు బొంగులు, ఇనుప ఫ్రేమ్‌లు, ఆర్టిఫీషియల్ ఫ్లవర్స్‌లు, విగ్రహం జాయింట్, ఫినిషింగ్‌లలో ఫైబర్‌లను ఉపయోగించి సుందరంగా తయారు చేస్తున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ స్థానంలో ఎక్కువగా పేపర్ పేస్టును ఉపయోగించడం వల్ల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసిన తరువాత పేపర్‌నీటిలో కరిగిపోయి పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించదు. పైగా ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో పోలిస్తే ఇవి చాలా వరకు తక్కువ బరువు ఉంటాయి. బొజ్జగణపతి, రామనామ గణపతి, దేవాలయం, టెంపుల్ సెట్టింగ్ గణపతి, టెంకాయ గణపతి, మూషిక వాహన గణపతి విగ్రహాలు అందరిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల విలువ చేసే వివిధ రూపాల విగ్రహాలను తయారు చేస్తున్నారు. పండుగకు 9 నెలల ముందుగానే విగ్రహాలకు తయారు చేయడం ప్రారంభిస్తారు. ఒక్కో విగ్రహం తయారీకి 25 రోజుల నుంచి నెలరోజులకుపైగా సమయం పడుతుందని, తనతోపాటు 20 మంది కార్మికులు విగ్రహాల తయారీలో పాల్గొంటారని రహీమ్ తెలిపారు. తాను తయారు చేసిన విగ్రహాలు ఎక్కువగా పూణే, బెంగళూరు, తిరుపతి, చెన్నై వంటి ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతాయని ఆయన తెలిపారు.

పర్యావరణ రక్షణకు మేలు



పేపర్‌పేస్టుతో తయారు చేసే విగ్రహాలు నీటి కాలుష్యం కాకుండా దోహద పడతాయి. 8 నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలు రూపొందిస్తున్నాం. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చి విగ్రహాలను తీసుకెళుతున్నారు.

– రహీమ్, విగ్రహ తయారీదారుడు, ప్రొద్దుటూరు

వినాయక ఉత్సవాలకు పటిష్ట చర్యలు

రాజుపాళెం : వినాయక చవితి ఉత్సవాలు సక్రమంగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాజుపాళెం ఇన్‌చార్జి తహసీల్దార్ గంగయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పోలీసు, ఫైర్, విద్యుత్, మెడికల్ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలను వెల్లాల, టంగుటూరు, వెలవలి, కూలూరు గ్రామాల సమీపంలోని కుందూనది వంతెనలపై నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వినాయక ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాలపై ఎవరెవరు ఏ బాధ్యతలు తీసుకోవాలో వారికి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటరమణ, ఈఓపీఆర్డీ షాకీర్‌ఆలీఖాన్, ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్, ఆర్‌ఐ హుస్సేన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

కలసపాడు : వినాయక చవితి పండుగ సందర్భంగా కలసపాడులోని సగిలేరు నదిలో విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను సోమవారం పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో చిన్న పిల్లలు, మహిళలు ఉండకూడదని తెలిపారు. గణపతి విగ్రహాల వెంట ఐదు మందికంటే ఎక్కువ ఉండకూడన్నారు. సాయంత్రం 5 గంటలలోపు నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

వనంపుల పంచాయతీలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని, అందుకే ఆయనను మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని అంటారని జెడ్పీటీసీ వంకెలచిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోకలమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వనంపుల పంచాయతీ అయ్యవారిపల్లె గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలతో పాటు 143కు పైగా హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. పెన్షన్ల హామీని అమలు చేసినట్లు ప్రకటించినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పెన్షన్లు తొలగించారని, కొత్త పెన్షన్లు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను రెడ్‌బుక్ పేరుతో వేధించి అక్రమ కేసులు బనాయించడం తప్ప మరేమీ చేయలేదన్నారు. సంపద సృష్టిస్తానని గొప్పలు చెప్పి పథకాలు అమలు చేయకుండానే ఏడాదిలోనే ఏకంగా రూ.1.81 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు తెచ్చిన అప్పు ఎక్కడికి పోయిందో ప్రజలకు తెలపాలని కోరారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎంత మేర నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మోసపు హామీలతో ప్రజలు ఎంత మేర నష్టపోయారు అనే జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయసుబ్బారెడ్డి, ఓబులేసు, ఉప సర్పంచ్ గంగసానిసుబ్బారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ఆయా పంచాయతీల నాయకులు రఘురామిరెడ్డి, సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తప్పవు



ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు, సీఐ

బద్వేలు అర్బన్ : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య, అర్బన్ సీఐ ఎస్.లింగప్ప పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను, దుకాణాలకు సంబంధించి గోడౌన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ధరల పట్టిక, స్టాకు రిజిస్టర్, స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను నిర్దేశించిన ధర కంటే ఒక్క రూపాయి ఎక్కువ అమ్మినా కఠినచర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇకపై ప్రతినిత్యం తనిఖీలు ఉంటాయని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్వేలు, గోపవరం మండలాల వ్యవసాయాధికారులు అరుణ, విజయరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : 2012లో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను ఉద్దేశ్యపూర్వకంగా రద్దు చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న గోపవరం తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని, రజకులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పొంగూరునాగరాజు పేర్కొన్నారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య, రజక వృత్తిదారుల సంఘం నాయకులు చెన్నయ్య, మల్లికార్జున, వంశ వృత్తిదారుల సమాఖ్య ఏరియా కార్యదర్శి శివప్రసాద్, పట్టణ నాయకులు కొండయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు

గోపవరం : ప్రభుత్వ భూమిని ఆక్రమించడమేగాక సంబంధిత అధికారులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ గోపవరం రెవెన్యూ పొలం 1194–1, 290 సర్వేనెంబర్లలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి ఈ నెల 20వ తేదీన ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వకపోగా సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన గోపవరం గ్రామానికి చెందిన రాజగోపాల్‌తో మరికొందరు కార్యాలయం వద్దకు వచ్చి లోపలికి రాకుండా బయట నానా దుర్భాషలాడారని, అదే సమయంలో క్షేత్రస్థాయి పరిశీలనకు తహసీల్దారు బయలుదేరే సమయంలో రాజగోపాల్, మరికొందరు దౌర్జన్యం చేస్తూ ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు.

30న గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు ఈ నెల 30న ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.జయరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు, గణిత శాస్త్రం, సివిల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ, యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఉన్నాయని ఆయన వివరించారు. సివిల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీలో అభ్యర్థులు ప్రథమ శ్రేణిలో ఎంటెక్ డిగ్రీ కలిగి ఉండాలని, ఇంగ్లిషు, గణిత శాస్త్రం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు యోగివేమన వేమన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ చూడాలని సూచించారు.

బాలకార్మికులపై సమాచారం ఇవ్వండి

మైదుకూరు : బాల కార్మికులను ఎవరైనా గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కి సమాచారం ఇవ్వాలని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1098పై సోమవారం స్థానిక జిల్లా పరిషత్ గరల్స్, ఉర్దూ హైస్కూళ్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని ఏ ఫోన్ నుంచైనా ఈ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగినా, బాల్య వివాహాలు జరిగినా, రైల్వే స్టేషన్‌లో, బస్టాండ్‌లో భిక్షాటన చేస్తున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి వరుసగా మూడవసారి ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గతంలో మూడు పర్యాయాలు ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మరో మూడు పర్యాయాలు జిల్లా అధ్యక్షులుగా పనిచేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే ఆ బాధ్యతకు న్యాయం చేసినవారమవుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి.భారతి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి జకరయ్య, ఉపాధ్యాయులు రామయ్య, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కాశినాయన : మండలంలోని బాలయాపల్లెకు చెందిన గంటా రామకృష్ణారెడ్డి అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సోమవారం వారి స్వగృహానికి వెళ్లి రామకృష్ణారెడ్డి మృతదేహానికి పూమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించి ఓదార్చారు. పార్టీ తరపున వారి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన తెలిపారు.

ఎమ్మార్పీ ధరకే ఎరువుల విక్రయాలు జరగాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ దేవి పద్మలత

చాపాడు : అన్ని ఎరువులను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అన్ని ఎరువుల దుకాణాలలో సోమవారం వ్యవసాయాధికారి ఎరువుల విక్రయాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకూ ఎరువులను విక్రయించాలని, ఇలా కాకుండా అధిక ధరలకు ఎరువులను విక్రయించరాదన్నారు. అధిక ధరలకు విక్రయాలు చేస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎరువుల కొనుగోలుకు రైతులు బిల్లులు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ రాజవంశ వర్ధన్

బ్రహ్మంగారిమఠం : ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ లావాదేవీలు ఎంతో ఉపయోగకరమని భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ కె.రాజవంశ వర్ధన్ పిలుపునిచ్చారు. సోమిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం–3లో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్స్‌పై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులతో త్వరితగతిన లావాదేవీలు జరపవచ్చన్నారు. అలానే సైబర్ ఆర్థిక నేరాల పైన అవగాహన పెంపొందించుకుంటూ మన తోటి వారికి తెలియజేయాలని చెప్పారు. ఇన్సూరెన్స్ పథకాలను ప్రతి ఒక్కరూ తీసుకొని బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీజీబీ రిటైర్డ్ మేనేజర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తూ మీమీ బిడ్డలకు ఎడ్యుకేషన్ లోన్ ద్వారా ఉన్నత చదువులు చదివించి జీవితంలో స్థిర పడాలని కోరారు, హెల్త్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ కె.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పొదుపు మహిళలు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని మొబైల్ గేములు స్క్రీన్ షాట్లు సోషల్ మీడియా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. పొదుపు సంఘాల సీసీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు నేరాల పట్ల జాగృతిగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే సమాధానం ఇవ్వకూడదని సూచించారు. హెడ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌కు గురైన వారికి 1930 టోల్ ఫ్రీ నెంబర్ శ్రీరామరక్ష లాంటిది అన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్స్ పై అవగాహన కల్పించే పోస్టర్, పాంప్లెట్స్‌ను విడుదల చేశారు. రాట సంస్థ కళాకారుల బందం సైబర్ క్రైమ్స్ పై తమ పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లి పంచాయతీ వెల్ఫేర్ అధికారి పీరయ్య, పొదుపు మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాల దైవం బీపీ మండల్



బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వెనుకబడిన కులాల దైవం బిందేశ్వరిప్రసాద్ మండల్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పేర్కొన్నారు. బీపీ మండల్ 107వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీపీమండల్ చేసిన కృషి ఫలితంగానే రిజర్వేషన్ల ప్రక్రియ అమలులోకి వచ్చిందన్నారు. తొలుత బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ చైతన్యసమితి జాతీయ అధ్యక్షులు బి.సి.రమణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.వి.రమణ, జాయింట్ సెక్రటరీ ఎస్.ఎన్.సుబ్బరాయుడు, పెన్షనర్ల సంఘం కార్యదర్శి బ్రహ్మయ్య, పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష, బీసీ సంఘం నాయకులు నాగార్జున, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఆలయ పాలకమండలి నూతన చైర్మన్‌గా దాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కమిటీ మెంబర్లు పి.రాధా, జి.రాజేశ్వరి, సి.సావిత్రి, ఆర్.ప్రసాద్, జి.శివనాగిరెడ్డి, వై.శ్రీనివాసులరెడ్డి, ధనుంజయశర్మ, ఎక్స్‌అఫిసియో మెంబర్‌గా లక్ష్మీనారాయణ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోస్ట్ గార్డ్ రమణారెడ్డి సాహసం స్ఫూర్తిదాయకం



రమణారెడ్డిని సన్మానిస్తున్న విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : భారత తీరప్రాంత రక్షణ దళంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పాలకొలను రమణారెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా సీజీసీ మెడల్ అందుకోవడం రెండు తెలుగురాష్ట్రాలకు దక్కిన గౌరవమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. రమణారెడ్డి సాహసం స్ఫూర్తి దాయకమన్నారు.సోమవారం పోరుమామిళ్లలో రమణారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. భారత మత్స్యకారులను పాకిస్తాన్ తీరప్రాంత సైనికుల నుండి కాపాడటంలో తెగువ చూపి విజయం సాధించిన ఘటనలో రమణారెడ్డి అభినందనీయుడన్నారు.

1098పై అవగాహన కలిగి ఉండాలి

కాశినాయన : విద్యార్థినులు ప్రతి ఒక్కరూ చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098పై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ తెలిపారు. సోమవారం నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలకార్మికులు, మైనర్లకు లైంగిక వేధింపులు, పిల్లలను ఇతర రకాల వేధింపులకు గురిచేస్తే 1098 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మీకు ఇచ్చే సమస్యలను సమర్థవంతంగా, ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.